


సమకాలీన సమస్యలపై వ్యంగ్యాస్త్రాల పరంపర!!

*16*

## సాహిత్యంలో చమత్కారం

**ఒక రోజు కాళిదాసు కాశీక్షేత్రంలోని వ్యాస** భగవానుడి విగ్రహం చూసి బొడ్డులో వేలుపెట్టి ఏదో వెదకసాగాడుట. "ఏంటి వెతుకుతున్నావు? " అని అడిగారు మిత్రులు.

"మా'మా ముత్తాత వ్యాసులవారు తరచుగా శ్లోకాల్లో 'చ'కారం తెగవాడుతుంటారుగదా! గీతలో దుర్యోధనుడు తన పక్షం వాళ్ళ పేర్లు చెబుతూ 'భగవాన్, భీష్మశ్చ, కర్ణశ్చ, కృపశ్చ, సమితింజయః' అంటూ ఒక్క వరసలోనే మూడు 'చ'కారాలు వాడేశారు. మిగతా పురాణాలు, ఇతిహాసాలలోనూ ఇదే వరస. వ్యాసులవారు 'చ'కార కుక్షి. బోలెడన్ని 'చ'కారాలు పొట్టలో అట్టేపెట్టుకున్న మహానుభావుడు. కొన్నైనా నాకు దొరికితే నా రచనల్లో ఉపయోగించుకుందామని ఇలా వేలుపెట్టి వెదుకుతున్నాను" అన్నాడుట కాళిదాసు.

మిత్రులకు సరదా అనిపించి కానీ. వ్యాసులవారికి మాత్రం ఆగ్రహం తెప్పించింది. మునిమనవడి వేళాకోళం. ఆయన కోపం వల్ల కాళిదాసు వేలు వ్యాసుడి బొడ్డులో ఇరుక్కుపోయింది.

"నేను రాసింది లక్షల్లో శ్లోకాలు. వేలపాత్రలతో, వందలకొద్దీ చారిత్రిక వర్ణనలతో రచన సాగించాల్సి వచ్చినప్పుడు 'చ'కారాల్లాంటివి సంధి, ఛందస్సుల సౌలభ్యం కోసం వాడుకోవాల్సి వస్తుంది. నీలాగా ఏ పురాణ మూలాల్లోనుంచో తీసుకున్న చిన్న ఘట్టాన్ని ఎడాపెడా సాగతీసి కావ్యాల్లాగా రాసిన వాణ్ణికాదు. అహంకారంతో నువ్వు చేసిన హేళనకు ఇది నీకు శిక్ష. ఇంక నీ వేలు బైటకి రాదు" అన్నాడు వ్యాసుడు.

కాళిదాసుకి చేసిన తప్పు తెలిసి వచ్చింది. "తాతగారన్న చనువుతో చేసిన విమర్శే స్వామీ అది. తప్పనుకుంటే క్షమించండి. ఇంక మీ జోలికి రాను" అని చెంపలేసుకున్నాడు.

"ఊరికే వదిలే ప్రశ్నేలేదు. నీ సామర్థ్యం నిరూపించుకో! ద్రౌపదికి పాండవులు ఐదుగురూ భర్తలేకదా! ఐనా ధర్మరాజు, సహదేవుళ్ళలో ఒక ప్రత్యేకత ఉంది. అదేంటో వివరిస్తూ శ్లోకం చెప్పు. ఒక్క 'చ'కారం వాడినా నీవేలు ఊడి రాదు. గుర్తుంచుకో!" అని పరీక్ష పెట్టాడు వ్యాసులవారు.

కాళిదాసు ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా శ్లోకం చెప్పాడు

"ద్రౌపద్యాః పాండు తనయాః పతి, దేవర, భావుకాః
న దేవరో ధర్మరాజః సహదేవో న భావుకః"

ద్రౌపదికి పాండు పుత్రులు భర్తలు. మరిదీ, బావ వరసలు కూడా. కానీ ధర్మరాజు మరిది కాదు. సహదేవుడు బావకాదు - అని ఈ శ్లోకం అర్థం.

ఈ శ్లోకంలో ఒక్క 'చ'కారం కూడా లేదు. కాళిదాసు వేలు ఊడి వచ్చింది. ఆ వేలుతోనే ఆ కవికుల గురువు ఎన్నో మహాకావ్యాలు రాసాడన్న విషయం మనందరికీ తెలిసిదే కదా!

పరిహాసానిక్కూడా పెద్దలతో చతుర్లాడకూడదని కాళిదాసు పాఠం నేర్చుకున్నాడు.

ప్రపంచ సాహిత్యం నిండా ఇలాంటి చమత్కారాలు చాలా ఉన్నాయి. వ్యంగ్యం జోలికి పోకుండా ఈసారి మన తెలుగు సాహిత్యంలోని ఇలాంటి కొన్ని చమత్కార పద్యాలను చెప్పాలన్నదే ఈ గల్పిక ఉద్దేశం. చిత్తగించండి.

1.కొండమీద నెమలి కోరిన పాలిచ్చు
పశువు శిశువు తోడ మాటలాడు
వేదములను చదివి పెద్దయిన బాపడు
కాకి మాంసము తిన గంటి కృష్ణ!

నెమలి పాలివ్వడం, శిశువు పశువు మాటలు, వేదాలు చదివిన బాపడు కాకి మాంసం తినడం - అంతా విడ్డూరంగా ఉంది గదూ!

కొండమీద నెమలి, కోరిన పాలిచ్చు పశువు, శిశువు తోడ మాటలాడు వేదములను చదివి పెద్దైన బాపడు, కాకి - మాంసం తిన గంటి కృష్ణ - ఇలా కామాలు పెట్టుకుంటూ చదువుకుంటే విడ్డూరం విరుగుడయిపోతుంది గదా!

2. తిట్టు కవిత్వానికి తెలుగు కవులు పెట్టింది పేరు. వట్టిగా తిట్టుకుంటే మనం చెప్పుకునేందుకు ఏముంటుంది? తిట్టులో కూడా గుట్టుగా చమత్కారముంటేనే గదా ఆ'కారం' ఘాటుగా ఉన్నా రుచికరంగా ఉండేది. గిట్టని ఇద్దర్ని గూర్చి మూడోవాడు తిట్టిన పద్యం ఇది:

అతడు నందికేశ్వరావతారమతండు (అంటే ఎద్దు)
పుత్రకుండు భోగి భూషణునకు (కుక్క)
శౌరి మూడవ 'అవతార'మతండు (అంటే పంది)
క్షాత్తు నౌకరి నౌకరు ఘనులు గారె!

3. తెలుగు లిపి చాలా చిలిపిది. నోటికే కాదు చేతికీ కొంత శ్రమ పెట్టేది. 'య-మ, వ-మ, ర-ల, న-స; ద-డ' వీటి మధ్య రాతపోలికలు చాలా ఎక్కువ. 'య-రలవమదనస' ఈ ఎనిమిది అక్షరాలను చక్కగా రాయడం నేర్చుకుంటే చాలుట, తెలుగక్షరాలు ముత్యాల్లాగా పేర్చవచ్చని ఓ కవిగారు చమత్కారంగా చెప్పుకొచ్చిన పద్యం ఇది:

యరలవమదనస యనుచును
పరువడి నీ యేను లిపులు భయనయ తతులన్
నిరతముగ వ్రాయుచుండిన
వర కరుణా వాని వ్రాలు వ్రటువలమరున్!

4 ప్రబంధ సాహిత్యమంటే 'చంటి' 'వంటి' మీదా చెప్పిన కవిత్వమనే ఒక అపప్రథ ముందు నుంచీ ఉన్నదే. దానికి విరుద్ధంగా వాడాల నరసింహం అని ఓ కవివరుడు 'పంటి'మీద చెప్పిన పద్యం - పన్ను పోగొట్టుకున్న ఆయనకు బాధగా ఉన్నా.. చదువుకునే మనకు చమత్కారంగానే ఉంటుంది.

మోమును చిన్నబోవగను ముగ్ధలు చూచి హసించు చుండ నెం
తోమది చింత నొందగను దిన్నని బల్కుల దుస్సిపోవగన్
గోమల దంత చేలమంది గుందుచు వ్రాలగ బూర్వజన్మ హృ
ద్దామము బాసిపోతివే! రదంబ! కదంబ పరిత్యజంబవై!

5.ఇంట్లో కట్టుకున్న ఇల్లాలు లేకపోయినా సర్దుకుపోవచ్చు గానీ. కాఫీలో చక్కెర లేకపోతే తట్టుకోవటం కష్టంట. కాఫీగత కవి ప్రాణి అల్లిన చమత్కార పద్యం ఇది.

పంచ దార లేక బ్రతుకంగ వచ్చును
పంచదార లేక బ్రతుకుటెట్లు?
కలియుగమ్మునందు కాఫీ గతప్రాణి
పంచదారకేల పట్టువిడుపు!

6. వేళకు రావు. వచ్చినా స్టేజీలో ఆగవు. ఆగినా అంటుకోనీయవు. ఏమిటో చెప్పుకోండి చూద్దాం. ఆర్టీసీ బస్సు. తుస్సు.. ఆమాత్రం తెలీదా మాకు' అని కస్సు బుస్సు మనకండి సారూ! మనకు లాంటి అనుభవమే ఓ కవిగారికి కలిగింది. కసిగా కలం తీసి ఈ పద్యం దూసారు

"వేళకు రాదు వచ్చినను వెళ్ళెడు తొందర స్టేజి చెంతకున్
మైలున ముందు వెన్కనొ సుమారుగా నిలుచును పాంథుడేగినన్
కేలును బట్టనీదు గిరిగ్రిరున దుల్పుక పోవుచుండ మా
పాలెము నందు బస్సు తొలిప్రాయపు దుడ్కను బోలి ఎప్పుడున్ (దుడ్క=దూడ)

7. ఒక కవిగారు తెలిసిన వాడుగదా అని సాహెబుగారికి చేబదులుగా వెయ్యి రూపాయలు ఇచ్చాడుట. నెలరోజుల్లో తిరిగిస్తానన్న పెద్ద మనిషి అయిపూ అజా లేడు. కనబడినప్పుడు ఒకసారి ఇప్పుడే ఇస్తాను, రేపుటెల్లుండిలో తీర్చేస్తాను అనటమో.. గట్టిగా నిలదీస్తే 'ఇస్తాంలేవయ్యా' అని దబాయించటమో.. చేస్తుండటంతో వళ్ళు మండి ఈ పద్యం చెప్పాడుట:

'అభీ' చ శబ్దం పక్షాంతరాణాం
'కల్', 'పర్సుం' శబ్దం మాసాంతరాణాం
'దేంగే', దిలాయేంగే' వర్షాంతరాణాం
దేఖో 'ఖుదాహై' చ యుగాంతరాణాం

ఇప్పుడే ఇస్తానంటే రెండువారాల్లో పని, రేపుటెల్లుండిలో ఇస్తానంటే నెలదాకా ఆగాలనీ, ఇస్తాం. ఇప్పిస్తాం' అంటే ఏడాదిలో ఎప్పుడైనా అనీ, చూడు. పైన దేవుడున్నాడు' అంటే మాత్రం ఈ యుగంలోపల ఎప్పటికైనా సరే అప్పు చెల్లిస్తానని ఆ సాహెబుగారి 'కోడ్' భాష అని అప్పిచ్చినవాడి మొత్తుకోలు.

8. ప్రతి పక్షంలో ఉన్నప్పుడు మద్యపాన నిషేధం, ప్రభుత్వంలోకి రాగానే మద్యం మీది అమ్మకాలు గుర్తువచ్చే పార్టీలు ప్రస్తుతం మనల్ని ఏలుతున్నవి. తాగుడు వల్ల చెడు జరుగుతుందని నమ్మేవారెంత మందున్నారో. మంచి జరుగుతుందని మనసారా భావించే వాళ్ళూ అంతే ముందున్నారు. ప్రపంచం అంతా కథే నడుస్తుంది.

భక్తి మది బుట్టు నఘముల బారగొట్టు
విమతులకు గుట్టు శేషత్వ విధికి పట్టు

దాహమును పోగొట్టు మనసు మోదముగ బెట్టు
దాసవిధికెల్ల తలకట్టు తణ్ణీ(కల్లు) బొట్టు - అని పిపాసి వాదన.

గుట్టు వెలిబెట్టు దేహమిట్టట్టు బెట్టు
కులము ఛీ కొట్టు దేహబాధలకు బెట్టు
వరుస చెడగొట్టు పలుమార్లు వర్లబెట్టు
వెనుక కలబెట్టు చెడగొట్టు వెణ్ణె(సారాయి) బొట్టు
అని మద్యదోషి నిరసన. రెండింటిలోని చమత్కారాన్ని మాత్రమే ఆస్వాదించి వదిలేస్తే మనకు వంటికి ఇంటికి మంచిది.

Post your comments